పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ మేయర్ శ్రావణి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విజయనగరం ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారిని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఈశ్వర్ కౌశిక్ దంపతులు శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనాలిచ్చి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పైడిమాంబ ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని డిప్యూటీ మేయర్ శ్రావణి ఆకాంక్షించారు.

జాకేరు సర్పంచ్ సారధ్యంలో భారీ అన్నసమారాధన

అన్నప్రసాదాలు స్వీకరించిన శ్రీ దుర్గాదేవి భక్తులు గ్రామస్తులు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో గ్రామ సర్పంచ్ బుద్ద చిన్నమ్మలు, అప్పల నాయుడు దంపతులకు సారధ్యంలో శనివారం భారీ అన్నసమారాధన జరిగింది. గ్రామంలోని శ్రీదుర్గాదేవి భవాని భక్తులు పూజా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ అన్నసమారాధనలో గ్రామంలోని భవానీ భక్తులు, గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భవానీ భక్తులు, పలు గ్రామాల ప్రజలువేలాదిగా పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.ఈ సందర్భంగా భవానీ భక్తులు మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ దంపతుల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసారన్నారు.

వర్షాభావంతో ఎండిపోతున్న వరి పొలాలు

ఠారెత్తిస్తోన్న ఎండలు
ఉసూరుమంటున్న రైతాంగం

విశాలాంధ్ర-వేపాడ: మండలంలో వేసవి ఎండల మాదిరిగా ఉష్ణంగా కాస్తున్నాయి. ఎండల తీవ్రతకు తోడు వరుణుడు కరుణించక పోవడంతో మండలంలో వర్షాభావపరిస్థితులు నెలకున్నాయి. సుమారు నెలరోజులుగా వర్షాలు పడకపోవడంతో వరిపంట పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది. ఇప్పటికే చెరువులన్నీ ఇంకిపోవడంతో మెట్ట వరి పొలాలన్నీ పూర్తిగా ఎండిపోయాయి.ఇక పల్లపు ప్రాంతాల్లో గల వరి పంట పరిస్థితి కూడా దయనీయంగా మారిపోయింది. చెరువులు, వాగులు, ఒంకలు, కాలువల్లో గల కొద్దిపాటి నీరును వరిపంటను కాపాడుకునేందుకు నీటి ఇంజన్లుతో రాత్రి పగలు అనకుండా రైతులు తోడిచినప్పటికి ఎండల తీవ్రతకు అనతికాలంలోనే ఆవిరైపోగా ఇకపై సాగునీరు ఎలా అందించాలో తెలియక రైతులు తలలు బాదు కుంటున్నారు.ఇక నాలుగైదు రోజుల్లో వర్షాలు పుష్కలంగా పడకుంటే పల్లపు ప్రాంతాల్లోని వరి పొలాలు కూడా ఎండిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఆరుగాలం కష్టపడి స్వేదం చిందించి తలకుమించిన అప్పులు చేసి వరి పంటను సాగు చేస్తే చివరికి వరుణుడి కటాక్షం లేక కళ్ళముందే వరిపంట ఎండిపోతుంటే మండల రైతాంగం ఉసూరు మంటూ కన్నీరు కాస్తున్న పరిస్థితి నెలకుంది. ప్రభుత్వం ఎండిపోతున్న వరి పంటలను పరిశీలించి రైతులు నష్టపోకుండా ఆదుకోవాలని మండల రైతాంగం కోరుతోంది.

అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న : వైస్ ఎంపీపీ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు అన్నారు. ఎస్.కోట దేవి వీధి వద్ద ఎస్-కోట ఎం.పి.టి.సి-2 మజ్జి దేవి-గంగరాజు దంపతుల ఆధ్వర్యంలో దుర్గాదేవి మాలధారులకు శనివారం జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు సతీమణి %ం% ఎస్.కోట వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు పాల్గొన్నారు. భక్తులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో ఎస్.కోట జెడ్పీటీసీ సభ్యురాలు ఎమ్.వెంకటలక్ష్మి, ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సంతోషికుమారి, ఎస్.కోట ఎం.పి.టి.సి-6 బొడ్డేటి అదిలక్ష్మి, వార్డు మెంబర్ ఆదారి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు సంజీవిని : ఎమ్మెల్యే బడ్డుకొండ

విశాలాంధ్ర-నెల్లిమర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు సంజీవిని లాంటిదని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పేర్కొన్నారు. నెల్లిమర్ల మండలం సారిపల్లిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబుతో కలిసి సందర్శించారు. ప్రతి పేదవానికి వైద్యం అందాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, వైసిపి మండల కన్వీనర్ చనమల్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కట్టకపోతే రద్దు చేయండి

ప్రాధాన్యతా భవనాలను పూర్తి చేయాలి
పట్టణాల్లో మరిన్ని ఆరోగ్య సురక్ష క్యాంపులు
వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర విజయనగరం : మంజూరైన ఇళ్లు కట్టుకోకపోతే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. అవసరమైతే పట్టాలను కూడా రద్దు చేస్తామని అన్నారు. కొంతమంది లబ్దిదారులు పునాదులు వేసి వదిలేశారని, పని ఆపేస్తే అది ఏ స్టేజిలో ఉన్నా రద్దు చేస్తామని స్పష్టం చేశారు. రద్దు చేసిన ఇళ్లను అర్హులకు అందజేయాలని సూచించారు. ఎంపిడిఓలు, ఎంఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీస్ సెక్రెటరీలతో శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న ఇళ్ల నిర్మాణం, ప్రాధాన్యతా భవనాలు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించారు. ఆయా మండలాల ప్రగతిపై ప్రశ్నించారు. వారం వారం లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని, ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. నవంబరు నాటికి మంజూరైన ఇళ్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణానికి ముందుకు రాని లబ్దిదారుల ఇళ్లను, ఇళ్ల పట్టాలను కూడా రద్దు చేసేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని చెప్పారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీ సెక్రెటరీలు ఇళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షించి, ప్రతి రోజూ ప్రగతిని నమోదు చేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లో విద్యుత్, త్రాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పూర్తయిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్ నెస్ సెంటర్లను వెంటనే ప్రారంభించాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల సంఖ్య పట్టణాల్లో పెరిగిందని, ఆ మేరకు షెడ్యూల్‌ను తయారు చేయాలని సూచించారు. ఈ క్యాంపుల గురించి వలంటీర్లు, ఇతర సిబ్బంది ద్వారా ఇంటింటికీ విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రతీ సురక్ష శిబిరంలో ఇద్దరు పిహెచ్‌సి డాక్టర్లు, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేసిన రోగులను పర్యవేక్షించి, వారికి నవంబరు 15 లోగా తదుపరి వైద్య చికిత్సను అందించాలన్నారు. ఆరోగ్య శ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడంతోపాటు, తమ పేర్లను యాప్‌లో రిజిష్టర్ చేసుకొనేవిధంగా చూడాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్‌పి సిఇఓ కె.రాజకుమార్, డిపిఓ నిర్మలాదేవి, హౌసింగ్ పిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ

విశాలాంధ్ర- శృంగవరపుకోట/ కొత్తవలస : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చం నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబు ఆధ్వర్యంలో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ పాల్గొన్నారు. ఈ సమావేశంలో లోకేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నియోజకవర్గంలో నవంబర్ 1 నుండి 45 రోజులు పాటు ప్రతి నియోజకవర్గంలో బాబుతో నేను బాబు మాట... భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టాలని వివరించారని గొంప క్రిష్ణ స్థానిక విలేకరులకు ఫోన్ లో తెలిపారు. అలాగే టీడీపీ జనసేనతో కలిసి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, రానున్న ఎన్నికల్లో వైసిపీ ఓటమే ధ్యేయంగా పనిచేయాలంటూ సూచించారని క్రిష్ణ వివరించారు.

ప్రకృతి వ్యవసాయ విస్తరణపై రైతులతో ముఖాముఖీ

విశాలాంధ్ర-మెరకముడిదాం: మెరకముడిదాం మండలం, సోమలింగపురం యూనిట్, భగీరథ పురం, గాతాడా గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ విస్తరణ కార్యక్రమాల గురించి రైతులతో ముఖాముఖీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళాసంఘాల సభ్యులతో, సామాజికంగా, చీపురుపల్లి -నబ్ డివిజన్, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ (ఎన్ఎఫ్ఐఎం) ఆధ్వర్యంలో పలు పత్ర ద్రావణం తయారుచేశారు. ఈ తయారీ విధానం రైతులకు అందుబాటులో ఉండే , ప్రకృతి వనరులతో, ఒక 200లీ. డ్రమ్ములో 25 రకాల ప్రకృతి లో సహజంగా లభ్యమయ్యే ఆకులు అనగా వేపాకు, జిల్లేడు, ఆముదం, నల్లేరు, గన్నేరు, ఉమ్మెత్త, వావిలాకులు, తూటికూడ, బొప్పాయి, వెదురు, సూపర్ నేపియర్ గడ్డి, జామ మొదలైన 20 %నుండి% లు, ఆకులన్నింటిని చిన్న, చిన్న ముక్కలుగా చేసి వెయ్యాలి. తరువాత నీరు పొయ్యాలి. 1కేజీ పచ్చిమిర్చి,1కేజీ వెల్లుల్లి ఒక 1 కేజీ పొగాకు పేస్ట్ గా తయారు చేసి, కలుపు వెయ్యాలి. ప్రతిరోజు ఉదయం , సాయంత్రం ఒక కర్ర సహాయం తో కలుపు వెయ్యాలి. ఇలా 5-7రోజులు మురిగినట్లయితే పలు పత్ర ద్రావణం తయారు అవుతుందని ఆయన వివరించారు. దీన్ని అన్నిరకాల పంటలకు, ఉపయోగించవచ్చు. ఈ యొక్క ద్రావణం పంట పెరుగుదలకు, గ్రోత్ ప్రమోటర్‌గా, అన్నిరకాల పురుగుల / తెగుళ్ళ నివారణకు పంట కు కావలసిన పోషకాలు కొరకు, ఉపయోగపడుతుంది. దీనిని 10లీ. నీటికి 1పలు పత్ర ద్రావణం వేసి పిచికారి చెయ్యాలి. కార్యక్రమంలో పి శ్రీనివాసరావు రైతులు, మరియు మండల యాంకర్, అప్పలనాయుడు, రాము, కళావతి, లోకేశ్వరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన దళిత నాయకులు

విశాలాంధ్ర-గరివిడి: విజయనగరంలో జరిగిన దళితుల ఆత్మీయ కలయికలో భాగంగా ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వర్యులు మేరుగ నాగార్జునను గౌరవపూర్వకంగా కలిసిన గరివిడి మండల దళిత నాయకులు అయిన డీసీసీబీ డైరెక్టర్ శివుకు కాంతారావు, గరివిడి గ్రామ సర్పంచ్ ప్రమీల కుమార్, ఏఎంసి డైరెక్టర్ తాండేల రాముక్కు, డైరెక్టర్ గుంటుబోలిక లక్ష్మణ, పాల్గొన్నారు.

జామిలో జగనన్నఆరోగ్య సురక్షకు విశేష స్పందన

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఎంపిడివో ఎం.సతీష్, సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉప సర్పంచ్ అల్లు పద్మలు ప్రారంభించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి గ్రామంలోని దాదాపు 500కు పైగా ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. వీరికి ఉచితంగా మందులను అందజేసారు. ఈసందర్భంగా ఉప సర్పంచ్ అల్లు పద్మ మాట్లాడుతూ గ్రామం పెద్దది కావడంతో రెండు రోజుల పాటు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. తిరిగి అనెల 25న మరోసారి శిబిరం ఏర్పాటు చేస్తారని, ఈఅవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులతో తనిఖీలు చేయించడం జరుగుతుందన్నారు. అనంతరం జెడ్పిఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ప్రజా ప్రతినిధులను కలిసి సందర్శించారు. కార్యక్రమంలో డిటి సునీత, జామి పిహెచ్‌సి వైద్యాధికారిణి డా. సౌమ్యా లక్ష్మి, హెచ్ఇ అనిల్ కుమార్, ఎంపిటిసి సూరిదేముడు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకి రూ.10 వేలు పెన్షన్ ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి

విప్లవ సినీ దర్శకులు అమరజీవి కామ్రేడ్ టి.కృష్ణ 36వ వర్ధంతి సభ
సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : శనివారం డి.ఎస్.ఆర్ అమర్ భవన్ లో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా గౌరవాధ్యక్షుడు బుగత అశోక్ ఆధ్వర్యంలో విప్లవ సినీ దర్శకులు అమరజీవి కామ్రేడ్ టి. కృష్ణ 36 వ వర్ధంతి సభ లో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వామపక్ష, విద్యార్థి, యువజనోద్యమాల పట్ల ఆకర్షితుడై విద్యార్థి యువజన సమాఖ్య ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు. ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలిలో అనేక నాటకాలలో నటించి దర్శకత్వం వహించారు. వామపక్ష, అభ్యుదయ భావాలతో సినీ రంగానికి విశిష్ట సేవలు అందించడంతో పాటు రాజశేఖర్, విజయశాంతి వంటి ఎంతోమంది నటి నటులను, వందేమాతరం శ్రీనివాస్ ని సంగీత దర్శకులుగా సినీరంగానికి పరిచయం చేశారు. ఆయన ప్రజా సమస్యలు, సామాజిక సమస్యలను ప్రతిబింబించే కథలతో అత్యంత సాహసోపేతంగా చిత్రాలు ఈతరం ఫిలిమ్స్ బ్యానర్ లో నిర్మించి కథ, కథనం, దర్శకత్వం వహించి ఆయా సమస్యల పట్ల ప్రజలలో, సమాజంలో ఆలోచనలు రేకెత్తించారు. ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'నేటి భారతం', 'దేశంలో దొంగలు పడ్డారు', 'రేపటి పౌరులు'. ఆయన దర్శకత్వం వహించిన 'దేవాలయం', 'వందేమాతరం' 'ప్రతిఘటన' (తెలుగు, కన్నడం) చిత్రాలు సినిమా మీడియంలో మాకు ఒరవడిని సృష్టించాయి. ఈ చిత్రాలన్నీ ఎన్నో అవార్డులు పొందాయి. చాలా కొద్దికాలంలోనే అత్యుత్తమ సంచలన దర్శకుడుగా అవార్డులు, రివార్డులు అందుకుని ప్రజా దర్శకుడిగా పేరొందారు. కేవలం 6 తెలుగు, 1 కన్నడ చిత్రాలకి దర్శకత్వం వహించి విప్లవ దర్శకుడుగా తనకంటూ ఒక సంచలనం సృష్టించారు. ఆయన దర్శకత్వం వహించిన ప్రతిచిత్రం ఒక ఆణిముత్యం ప్రత్యేకించి 'ప్రతిఘటన' చిత్రం ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు ఆర్జించిపెట్టింది. కొంతకాలం గోలకొండ పత్రికలో సినిమా సమీక్షలు వ్రాయడం, హైదరాబాదులోని ఆలిండియా రేడియోలో గ్రామస్తుల కార్యక్రమాలలో "లింగడు" అనే తెలంగాణ యాసలో మాట్లాడే పాత్రను నిర్వహించడం వంటివి చేశారు. ఆదర్శం అనే సినిమాలో సావిత్రికి జంటగా ఒక హాస్యపాత్రలో నటించారు. ఆదే చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఎం.ఓ.రాజన్ వద్ద ఎడిటింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. రాజ్ కపూర్ తీసిన ప్రేమలేఖలు సినిమాలో "ప్రాణ్"కు తెలుగులో డబ్బింగ్ చెప్పారు. అమర సందేశం చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేశారు. కృష్ణ ప్రేమ చిత్రంతో ఇతను పూర్తి స్థాయి ఎడిటర్‌గా మారి 30కి పైగా చిత్రాలకు ఎడిటర్‌గా పని చేశారు. ఆయన నటించిన ఆఖరి చిత్రం అర్ధరాత్రి స్వతంత్రం సినిమా విడుదల కాకముందే ఆయన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ 1986 అక్టోబర్ 21 వ తేదీన తనువుచాలించి తుదిశ్వాస విడిచారు. ఆయన వర్ధంతి సందర్భంగా కళాకారులకు నెలకి 10 వేల రూపాయలు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో గురజాడ కళాక్షేత్రం ఏర్పాటు చేసి అంతరించిపోతున్న కళలను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి నేతృత్వంలో కళాకారులని ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవన్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు కళ్ళ కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి తామాద రాము, ఏఐవైయస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బాయి రమణమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత పావని, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. నాగభూషణం, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు తదితరులున్నారు. మహిళలు కోలాటం, కళాకారులు పాటలు ప్రదర్శన నిర్వహించారు.

నాటు సారా, నిషేధిత మత్తు పదార్థాల జోలికి పోయి జీవితాలు నాశనం చేసుకోవద్దు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జై భీమ్

విశాలాంధ్ర-బొబ్బిలి: నేటి యువత నైతిక విలువలతో కూడిన విద్య పైన ప్రత్యేక దృష్టి సారించి ఉద్యోగ సాధనకు కృషి చేయాలని నాటు సారా, గంజాయి ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ జై భీమ్ కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు.శనివారంస్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఎస్. జైభీమ్ ఆధ్వర్యంలో నాటుసారా నివారణ, అవినీతి పరివర్తన అవగాహన కార్యక్రమం నియోజకవర్గ పరిధి రామభద్రపురం మండలం కొండ కెంగువ, కోట శిర్లాం గ్రామాల్లో చేపట్టారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సి.ఐ. జైభీమ్ మాట్లాడుతూ నాటుసారా తయారుచేసినా అమ్మినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు నాటుసారా తాగటం వలన కలిగే కష్ట, నష్టాలను వివరించారు. నాటుసారా కి బానిస అవటం వలన కలిగే అనారోగ్య సమస్యలనువివరించారు. నాటుసారా వల్ల కుటుంబ బాంధ వ్యాలు చిన్నాభిన్నం అవుతాయని, సమాజం లో గౌరవాన్ని కోల్పోతారని, ఆర్థిక వెనకబాటు కు గురవుతారని తెలిపారు. గ్రామ ప్రజలందరూ నాటుసారా వ్యాపారం మానుకొని మత్తు నుంచి తేరుకోవాలని కోరారు. నాటుసారా నివారణ పై గ్రామస్తులందరికి అవగాహన కలిగే విధంగా నాటుసారా తాగడం వలన వచ్చే అనారోగ్య సమస్యలు తెలియ చేసే విధంగా ముద్రించిన కరపత్రాలను గ్రామస్తులందరికి అందిస్తూ నాటుసారా నివారణకు కృషి చేయడం జరుగుతుందని సీఐ జైభీమ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది చంద్ర ప్రసాద్,జయరాం నాయుడు,ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోమవారం స్పందన కార్యక్రమం రద్దు

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం ఈనెల 23న సోమవారం 'దసరా' పండుగ సందర్భంగా ప్రభుత్వం శెలవు దినంగా ప్రకటించినందున ఆరోజు జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని నిర్వహించబడదని కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి ఆర్. ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీన్ని పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు, అధికారులు గమనించాలని కోరారు.

అయోడైజ్డు ఉప్పునే వినియోగించాలి

విశాలాంధ్ర-బెలగాం: అయోడైజ్డు ఉప్పునే వినియోగించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బి.జగన్నాథరావు అన్నారు. ప్రపంచ అయోడిన్ లోపం వలన కలిగే వ్యాధుల వారోత్సవాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శనివారం పార్వతీపురంలో ప్రారంభించారు. వారోత్సవాలు ఈ నెల 27వ తేదీ వరకు జరుగుతుందని చెప్పారు. అయోడిన్ లోపం వలన కలిగే ఆరోగ్య సమస్యలను గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతుందని వివరించారు. డివిజనల్, మండల, గ్రామ సచివాలయ స్థాయిలో సభలు సమావేశాలు, ర్యాలీలు, క్విజ్ పోటీలు, వర్క్ షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయోడిన్ లోపం వల్ల పిల్లల శారీరక, మానసిక వృద్ధి, మనోవికాసం లోపిస్తుందని అన్నారు. గర్భస్థ శిశువుల పిండ అభివృద్ధి, నిర్మాణము మందగిస్తుందని, స్త్రీలలో గర్భస్రావం, మృత శిశువు జననం, మరుగుజ్జుతనం వంటి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. పిల్లల్లో బుద్ధి మాంద్యం, చెవుడు, మూగతనం రావచ్చని, గాయిటర్ వ్యాధి, హైపో థైరాయిడ్ వ్యాధులు సంభవించవచ్చని చెప్పారు. ఈ లోపాలను అధిగమించుటకు ప్రజలందరూ అయోడిన్ కలిగిన ఉప్పును మాత్రమే వాడాలని పిలుపునిచ్చారు. అయోడిన్ ఉప్పు కలిగిన పేకెట్స్ పై నవ్వుతున్న సూర్యుడి బొమ్మ గుర్తు ఉంటుందని, గ్రామ స్థాయిలో ఆరోగ్య కేంద్రం ద్వారా ఉప్పులో అయోడిన్ ఉన్నదీ లేనిదీ తనిఖీ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్ సి వైద్యులు డా. లావణ్య, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అంగన్వాడీలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహన్ రావు

విశాలాంధ్ర-పాలకొండ : చిన్నారులు, గర్భిణీల ఆరోగ్య శ్రేయస్సుకు అంగన్వాడీలు,వైద్య ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. మండలంలోని మంచావలస, గంగన్న దొరవలస, కర్లవలస గ్రామాలలో శనివారం సందర్శించిన ఆయన అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలకు నిర్వహించిన వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేసి టీకా కార్డులు, రికార్డులు పరిశీలించారు. టీకా గడువు తేదీలు పక్కాగా నమోదు చేసి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. పిల్లలు,గర్భిణీల ఆరోగ్య పరిశీలన చేసి బరువు తక్కువగా ఉన్న వారిని పౌష్టికాహారం సరిగా తీసుకునేలాగా చూడాలన్నారు. హై రిస్క్ గర్భిణీలలో ఆరోగ్యాన్ని తరచుగా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రసవ సమయం దగ్గర పడుతున్న సమయంలో ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా అప్రమత్తంగా ఉండాలన్నారు. రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలని గర్భిణీలు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ప్రతి రోజూ వేసేలా గ్రామస్థాయి వైద్య పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శోభారాణి, సూపర్ వైజర్ జయ గౌడ్,వైద్య సిబ్బంది లీలావతి, శేషమ్మ ఉషారాణి, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

14వ వార్డులో జేఏఎస్‌ను డిఐఓ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-సాలూరు టౌన్: బంగారమ్మ కాలనిలో(14వ వార్డు) జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు శనివారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ప్రతీ కౌంటర్ వద్ద ప్రజలకు అందజేస్తున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు.ఎంతమందికి టోకెన్లు అందజేశారని,శిబిరం వద్ద కొత్తగా ఎంతమందిని నమోదు చేశారని వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. వైద్య సేవలు వినియోగించుకుంటున్న వారి నమోదు వివరాలు రికార్డుల్లో పరిశీలించారు. పలు ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారిలో ఆయా రోగాల వారీగా ఎంతమంది వైద్య సేవలు వినియోగించుకుంటున్నారని అడిగారు. ముఖ్యంగా జెఏఎస్ లో ఆరోగ్య తనిఖీల్లో కొత్తగా గుర్తించిన బిపి, మధుమేహం, రక్త హీనత గల కిశోర బాలికలు,కఫం పరీక్షల ద్వారా కొత్తగా నమోదు అయిన క్షయ వ్యాధి గ్రస్తులు,కళ్ళ తనిఖీలకు వచ్చినవారిలో కేటరాక్ట్ ఆపరేషన్లకు ఎంత మందిని గుర్తించారు, రిఫరల్ అవసరమైన వారిని పర్యవేక్షణ,కొత్తగా గుర్తించిన లెప్రసీ లక్షణాలు ఉన్నవారు,పిల్లల్లో పుట్టుక లోపాల గుర్తించడం తదితర అంశాలపై దృష్టి సారించి,వారికి పూర్తి స్థాయిలో వైద్యం అందజేయాలన్నారు.ఆంగ్రమిక వ్యాధుల గురించి ఇవ్వబడిన చిత్రాలతో కూడిన చార్టులను ప్రజలకు చూపిస్తూ అవగాహన కల్పించాలన్నారు. ల్యాబ్ వద్ద పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఫార్మసీ వద్ద పరిశీలించి మందులు వినియోగించు విధానాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. అక్కడ ప్రజలతో డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు.గర్భిణీలు, బాలింతలలో హైరిస్క్,రక్త హీనత ఉన్న వారిని గుర్తించి తగు చికిత్స అందజేయాలని,పౌష్టికాహారం ఆవశ్యకత పై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు యు.మహిపాల్, ఎ.శ్రీ హర్షిత,సాయికిరణ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఎస్. రాణి, స్పెషలిస్ట్ వైద్యులు, సచివాలయ సెక్రటరీ పి.మురళీ కృష్ణ ,వైద్య సిబ్బంది,సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్వాడి కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి విజయగౌరి

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ నందు ఖాళీగా ఉన్న ఎనిమిది అంగన్వాడీ కార్యకర్తలు, అంగన్వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి కె. విజయగౌరి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన జారీ చేసారు. పాలకొండ మునిసిపల్ పరిధిలో 2 అంగన్వాడీ కార్యకర్తలు మరియు 3 అంగన్వాడీ సహాయకుల పోస్టులతో పాటు బలిజిపేట ప్రాజెక్ట్ పరిధిలో ఒక అంగన్వాడీ కార్యకర్త మరియు 2 అంగన్వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె చెప్పారు. ఈ ఖాళీలను రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన నిర్దేశించిన కమ్యూనిటీ రోస్టర్ రిజిస్టర్ అనుసరించి, ఐసిడిఎస్ ప్రాజెక్టు ఒక యూనిట్ గా పరిగణించి సంబంధిత కేటగిరీ అభ్యర్థులతో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. కావున అర్హులైన వివాహిత మహిళా అభ్యర్థినులు తమ దరఖాస్తులను ఈ నెల 25 నుండి నవంబర్ 1వ తేదీ సాయంత్రం 05.00 గం.లలోపు సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వారి కార్యాలయమునకు అందజేయాలని కోరారు. ఇంటర్వ్యూ తేదీ మరియు స్థలము తదుపరి తెలియజేయబడుతుందని, నియమ నిబంధనల మేరకు వచ్చిన దరఖాస్తుదారులను మాత్రమే ఇంటర్వ్యూకు పిలవడం జరుగుతుందన్నారు. సదరు పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు.2023 జూలై 1 నాటికి 21-35 మధ్య వయసు కలిగి, స్థానిక స్థిర నివాసం కలిగిన వివాహిత మహిళలు ఈ పోస్టులకు అర్హులని అన్నారు.ఎస్సీ, ఎస్టీ హేబిటేషన్లలో వారిని మాత్రమే భర్తీ చేయడం జరుగుతుందని, ఈ ప్రాంతాల్లో 21సం. లు నిండిన వారు లేనిచోట 18 ఏళ్ళు నిండిన వారిని నియమించవచ్చని చెప్పారు. కమిటీ నిర్ణయం మేరకు ఎంపిక ఉంటుందని ఆమె ఆ ప్రకటనలో వివరించారు.

సీడిగూడలో ఏనుగుల గుంపు...

విశాలాంధ్ర-కురుపాం: మండలం లోని తిత్తిరి పంచాయతీ సీడిగూడలో ఏనుగుల గుంపు సంచారం తో ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని జీవిస్తున్నారు. భామిని ప్రాంతం నుంచి వచ్చిన ఏనుగుల గుంపు ఎప్పుడు గ్రామాల్లో అలజడి సృష్టిస్తాయో అని ,పంటలు నాశనమ చేస్తాయోనని బిక్కుబిక్కు మంటున్నారు.ఏనుగులు నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

చినబుడ్డిడిలో బాబు తో మేము

విశాలాంధ్ర-కురుపాం: జియ్యమ్మవలస మండలం చినబుడ్డిడి లో బాబు తో మేము నిర్వహించారు. గత సంవత్సరం స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహావిష్కరణ జరుపుకున్న మొదట వార్షికోత్సవ సభను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్ల రాంబాబు , అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతాడ రామకృష్ణ యం.పి.పి. బొంగు సురేష్, అరుకు పార్లమెంట్ సమావేశాలకు కొప్పలవెలమ సాధికార అధ్యక్షులు మంచాడ నత్యనారాయడు , నియోజక వర్గ తెలుగు రైతు అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి నాయుడు, క్లస్టర్ 6 జోగి బాబు నాయుడు, మాజీ సర్పంచ్ కరణం అప్పలనాయుడు, మాజీ ఎంపిటీసి రాయిపిల్లి జయకిశోర్ ప్రారంభించారు ముందుగా గ్రామం లో స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించి , ఆశయసాధనకు కొరకు ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త కృషి చేయాలని పిలుపు నిచ్చారు. గ్రామ ప్రజలు ఆనంతరం జగన్ ప్రభుత్వ పాలనలో వారి విగ్రహం ఎదుట ప్రతిన పూనడం జరిగింది. తరువాత చినబుడ్డిడి గ్రామంలో గల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులతో కలిసి తెలుగుదేశం పార్టీ అధినేత గౌరవ నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ కు నిరసనగా గ్రామంలో గల ప్రతి ఇంటికి వెళ్లి అధినేత అక్రమ అరెస్ట్ ను వివరించడం వాటికి సంబంధించిన కర పత్రాలను ఇంటింటికీ ఇవ్వడం జరిగింది.

యూటిఎఫ్ నిరవధిక నిరాహార దీక్షలను భగ్నం చేసిన పోలీసులు

విశాలాంధ్ర - బెలగాం : సిపిఎస్, జిపిఎస్ రద్దు కొరకు యుటిఎఫ్ చేపట్టిన నిరవధిక దీక్షలను శనివారం పోలీసులు భగ్నం చేశారు. ఈ నెల 19వ తేదీ నుండి ఆహారం లేకుండా నిరాహారంగా దీక్షలు కొనసాగించిన యుటిఎఫ్ నాయకుల ఆరోగ్యం క్షీణించిందనడంతో పోలీసులు బలవంతంగా దీక్షలు భగ్నం చేసి దీక్షలో ఉన్న నాయకులను ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. మురళీమోహన్ రావు మాట్లాడుతూ దీక్షలు ప్రభుత్వం భగ్నం చేయవచ్చేమో కానీ, ఉద్యోగులు, ఉపాధ్యాయుల మనసులను గెలవలేరని అన్నారు. భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఐక్య పోరాటాలు నిర్వహించి ఓపిఎస్ ను సాధించుకుంటామని అన్నారు. జిల్లా అధ్యక్షులు టి. రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల కర్కశంగా ప్రవర్తిస్తుందని, దీక్షలను బలవంతంగా విరమింప చేయడం చేతకాని తనమని అన్నారు. దీక్షలను భగ్నం చేసే సందర్భంలో ప్రభుత్వ వైఖరిపైన, ప్రాణాలైనా అర్పిస్తాం - ఓపిఎస్ ను సాధిస్తాం అనే నినాదంతో ఉపాధ్యాయులు శిబిరం వద్ద నినదించారు. ఈ సందర్భంగా అన్ని ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, వివిధ ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలకు అధ్యా ఈ పోరాటానికి మద్దతిచ్చినందుకు ఉద్యమ అభినందనలు తెలియచేసారు. నిరాహార దీక్షలో ఎన్. మురళీమోహన్ రావు, టి. రమేష్, పి. సుదర్శన్, బి. రాజమణి, ఎం. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మన్యం ఆరాధ్య దైవం 'మాలతమ్మ'

విశాలాంధ్ర-కురుపాం: మన్యం ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం ,కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం మాలతమ్మ అమ్మవారు.కురుపాం మండలం గొటివాడ పంచాయతీ నేరేడు వలస లో వేంచేసి దశాబ్దాలుగా పూజలందుకుంటు భక్తుల పాలిట కల్పవల్లి గా దీవెనలు అందిస్తుంది. పార్వతీపురం మన్యం జిల్లా లో అత్యంత ప్రాముఖ్యత మహిమ గల దేవత ఏజెన్సీ ప్రాంతంలో ఏక్కడ ఏ అభివృద్ధి పనులు ప్రారంభించాలన్నా ,కొత్త వాహనాలు ప్రారంభించాలన్నా ,గిరిజన రైతులు పంటలు వేసే ముందు ప్రత్యేక మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అలాగే అన్ని పనులు సకాలంలో పూర్తి అయిన తర్వాత తిరిగి మొక్కులు చెల్లించుకుంటారు. ప్రతీఏటా దసరా నవరాత్రి ఉత్సవాలు మన్యం లో నిర్వహిస్తారు.దసరా రోజు వారం పూజలు కోసం మన్యం జిల్లా నలుమూలల నుంచి వేలాది గా భక్తులు అమ్మవారి దర్శనానికి రావడం ఆనవాయితీ గా వస్తోంది. రాయగడ ప్రముఖ జగన్మోహినీ అమ్మవారికి కి గల ప్రాముఖ్యత మాలతమ్మ కు ఉంది. గిరిజన ప్రాంతాల్లో ఉండటంతో ఆలయ అభివృద్ధి కనిపించలేదు .ఇటీవల దాతలసాయంతో దశలవారీగా అభివృద్ధి పనులు ఆలయ కమిటీ చేపడుతుంది. దసరా రోజున కురుపాం,గుమ్మలక్ష్మీపురం పోలీసులు భక్తులకు దర్శనానికిసావానాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.ఉత్సవాలు మొదటి రోజు ప్రత్యేక హోమం, విజయదశమి రోజున ఉయ్యాల కంబాల ,ఉత్సవ విగ్రహం తిరువీది, అనంతరం మూడు రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు పూర్తి చేస్తారు. ఆలయ అభివృద్ధి కి స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరుతున్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవా నిరతి గొప్పది : కోలగట్ల



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్వచ్ఛంద సంస్థల సేవా నిరతి గొప్పదని.. ఆపద, అత్యవసర సమయంలో ప్రజలకు ధైర్యం కలిగిస్తున్నారని ఏపీ శాసనసభ ఉపసభాపతి, విజయనగరం శాసనసభ్యులు కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గోల్డెన్ అవర్.. గోల్డెన్ లైఫ్ సంస్థ సభ్యులు విజయనగరం పట్టణంలో 10 ఉచిత అంబులెన్స్ సేవలను అందిస్తున్నారు. ఈ వాహనాలను ఉప సభాపతి కోలగట్ల శనివారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి సమాజహిత కార్యక్రమాలకు శాసనసభ్యునిగా తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. అంబులెన్స్ సర్వీసులను తమ ఉపాధి కోసం ఎవరైనా ప్రారంభిస్తారని.. కానీ, వీరు కేవలం ఆపదలో ఉన్న వారిని కాపాడే సేవా దృక్పథంతో వాహనాలను నడపడం ప్రశంసనీయమన్నారు. ఇంటి నుంచి ఆసుపత్రికి నగరంలోని ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉచితంగా సేవలు అందిస్తారని తెలిపారు. అత్యవసర సమయంలో సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు భోగాపురపు రవిచంద్ర, మారం బాల బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కిడిలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర-పార్వతీపురం : మన్యం జిల్లా, గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలం, కుక్కిడి గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పంచాయితీ పరిధిలో వివిధ గ్రామల నుండి గిరిజనులు వచ్చి వైద్యసేవలు అందుకున్నారు. ఈ శిబిరంలో భద్రగిరి అంగనీవాది కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్సు పలువురిని ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఆరిక రాజారావు, ఎంపీటీసీ మండంగి రమణ, ఎంపీడీఓ, తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బుద్దేశ్వరరావు, అఖిలాష్, వైద్య సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరం ఉత్సవాలకు షార్ట్‌ఫిల్మ్ పోటీలు

విశాలాంధ్ర-విజయనగరం విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు పురస్కరించుకొని షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉజ్వల్ వెంకట్ ఒక ప్రకటన లో తెలిపారు. అందుకుగాను ఆసక్తి గల అభ్యర్థులు తేదీ. 26.10.2023 లోపల తమ షార్ట్ ఫిల్మ్ తీసి యూత్ వెల్ఫేర్ ఆఫీస్, విజయనగరం వారి కార్యాలయంనకు అందజేయాలని కోరారు. గైడు లైన్స్: షార్ట్ ఫిల్మ్ కాల వ్యవధి 5 నుండి 10 నిమషాలు లోపల ఉండాలి, 15 సంవత్సరాల నుండి 30 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే అర్హులు, గత 5 సంవత్సరాలలో బహుమతి పొందివారు అర్హులు కారు. డిక్లరేషన్ ద్వారా మీరు పంపిన ఫిల్మ్ ఇంతకు ముందు ఎక్కుడా ప్రదర్శించ లేదని తెలపాలి. విజేతలను న్యాయ నిర్ణీతలు ఎంపిక చేస్తారు. అంశం : బాల్య వివాహాలు / లేదా పోషకాహార లోపం మరియు రక్తహీనత, మొదటి బహుమతి : రూ. 20,000, రెండవ బహుమతి రూ. 15,000 కాగా, మూడవ బహుమతి రూ. 10,000, మూడు కన్సలేషన్ బహుమతులు ఒక్కోక్కదానికి రూ. 3వేలు చొప్పున గెలుపొందిన మొదటి ముగ్గురి ఫిల్మ్ వారికి విజయనగరం ఉత్సవాల చివరి రోజున ప్రదర్శించబడుతుందని, ముఖ్యఅతిథితుల చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 7036485273 లో సంప్రదించాలని కోరారు.

యూటిఎఫ్ నిరవధిక దీక్షకు పిఆర్టీయు సంఘీభావం

పిఆర్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సూర్యనారాయణ



విశాలాంధ్ర-బెలగాం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో యుటిఎఫ్ నిర్వహిస్తున్న నిరవధిక దీక్షకు పిఆర్టీయు పూర్తి సంఘీభావం ప్రకటించిందని పిఆర్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాగాన విజయ్, రాష్ట్ర కార్యదర్శి జక్కు రామినాయుడు, జిల్లా కార్యదర్శి గుల్ల రామినాయుడు ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులు దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. లక్ష్మునాయుడు, రామారావు నాయుడు, సంతోష్, ప్రధానోపాధ్యాయుల సంఘం కార్యదర్శి మజ్జి గౌరీశంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు శ్లాఘనీయం: కలెక్టర్, జిల్లా ఎస్పీలు



విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం: సమాజ రక్షణ కొరకు ప్రాణత్యాగం చేసిన పోలీసు అమర వీరుల సేవలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ లు తెలిపారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా పోలీస్ శాఖ అధ్వర్యంలో జరిగిన పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవానికి జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాజరై నివాళులు అర్పించారు. వారితో పాటు జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు, అడిషనల్ ఎస్పి డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, డి.ఎస్.పి.లు, సి.ఐ.లు, ఎస్.ఐ.లు, పోలీసు సిబ్బంది పోలీసు అమర వీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలను ఉంచి నివాళులు అర్పించారు. కలెక్టరు ప్రసంగిస్తూ 1959 అక్టోబరు 21న హిమాలయాల్లోని ఆక్సాయిన్ అనే ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న 10మంది సీఆర్పీఎఫ్ జవానులను శత్రు దేశ సైనికులు హతమార్చారని, అప్పటి నుండి దేశ భద్రతకు ప్రాణ త్యాగాలు చేసిన పోలీసు వీరులను స్మరించుకొంటూ ప్రతీ సంవత్సరం అక్టోబరు 21న అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. శత్రు దేశాల నుండి దేశాన్ని కాపాడే వారు వీర జవానులు అయితే దేశంలో శాంతి భద్రతలను రక్షించే బాధ్యత పోలీసు బలగాలు తీసుకొని దేశానికి విస్తృతమైన సేవలందిస్తున్నాయన్నారు. విధి నిర్వహణలో అనేక మంది పోలీసులు ప్రాణత్యాగం చేసారని, ముంబయి పై తీవ్రవాదులు దాడిచేస్తే వారిని ఎదుర్కొనుటకు ప్రాదమిక రక్షణ భాధ్యతలు తీసుకొని అధికారులు, పోలీసులు అమరులయ్యారని, ప్రాణాలు కోల్పోతున్న పోలీసుల సంఖ్య ప్రతీ ఏడాది పెరుగుతూనే వున్నప్పటికీ, పోలీసులు విధి నిర్వహణలో రాజీలేని పోరాటాలకు జరిపి తీవ్రవాద చర్యలను ఎదిరించడంలోను, శాంతిభద్రతల పరిరక్షణలోను కీలకమైన పాత్రను పోషిస్తూనే ఉన్నారన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పోలీసుశాఖలో ఇప్పటి వరకు శాంతి భద్రతల పరిరక్షణలో ఒకరు, తీవ్రవాద ప్రతీకారదాడులలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని, ప్రజల రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీసులు నేడు భౌతికంగా మన మధ్య లేకున్నా, పోలీసుశాఖకు వారు చేసిన సేవలు శ్లాఘనీయని, వారి కుటుంబాలను గౌరవించు కొనవలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపై గలదని తెలిపారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ పోలీసు స్టేషనులో సబ్ ఇనస్పెక్టరుగా పనిచేస్తూ విధినిర్వహణలో అమరులైన స్వర్గీయ ముద్దాడ గాంధి సతీమణి మనోరంజని మరియు వారి కుటుంబ సభ్యులను, కురుపాం పోలీసు స్టేషనులో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ విధి నిర్వహణలో అమరులైన స్వర్గయ బి.శ్రీరాములు సతీమణి ప్రమీల మరియు వారి కుటుంబ సభ్యులను గౌరవించి, వారు సమాజానికి చేసిన త్యాగాలను స్మరించుకొన్నారు. ఈకార్యక్రమంలో ఆర్.ఐ. పి.వి.ఆర్.కె. కుమార్ పెరేడ్ కమాండర్ గా వ్యవహరించారు.

రాష్ట్ర టీడీపీ సమావేశంలో పాల్గొన్న విజయ్‌చంద్ర, జగదీష్, చిరంజీవులు



విశాలాంధ్ర-పార్వతీపురం: మంగళగిరిలోని రాష్ట్ర తెలుగు దేశం పార్టీ కార్యాల యంలో శనివారం జరిగిన రాష్ట్ర టీడీపీ సమావేశం లో పార్వతీపురం నియోజకవర్గ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెంనాయుడు తదితరులంతా పెద్దఎత్తున పాల్గొని చేపట్టనున్న కార్యక్రమాలు గుర్చి, అక్రమ కేసులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు గత 43రోజుల జైల్లో ఉన్న సంధర్భంగా జరిగిన పరిణామాలు తదితర అంశాలపై చర్చించారని తెలిపారు. పార్టీ అధ్వర్యంలో చేయాల్సిన కార్యక్రమాలని వివరించారని తెలిపారు.

విడివికేల ఉత్పత్తులు జద్విఖ్యాతి కావాలి

ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి విష్ణుచరణ్



విశాలాంధ్ర-పార్వతీపురం/పార్వతీపురం టౌన్: వన్ ధన్ వికాస్ కేంద్రాల (విడివికే) ఉత్పత్తులు జద్విఖ్యాతి కావాలని పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్ అన్నారు. పార్వతీపురం మండలం అడారు గ్రామంలో అగర్ బత్తి తయారు కేంద్రాన్ని శని వారం ప్రాజెక్టు అధికారి సందర్శించారు. విడివికేలు ఉత్పత్తి చేస్తున్న అగర్ బత్తులు నాణ్యత కలిగి ఉన్నాయని ఆయన ప్రశంసించారు. ఉత్పాదకాలు జిల్లా స్థాయి వరకు మాత్రమే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలోకి వెళ్లాలని ఆయన చెప్పారు. ఇందుకు అవసరమగు సహాయ సహకారాలు ఐటిడిఏ అందిస్తుందని ఆయన అన్నారు. స్థానికంగా లభ్యమయ్యేముడిసరుకులువినియోగించుకోవాలని తద్వారా విలువ ఆధారిత ఉత్పాదకాలు రావాలని ఆయన పిలుపునిచ్చారు. నాణ్యతలో రాజీ లేకుండా ఉత్పాదకాలను విశ్వ విఖ్యాతం చేయాలని ఆయన సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా అగర్ బత్తులు ప్రఖ్యాతిగాంచిన బ్రాండ్ల సరసన చేరాలని ఆయన ఆకాంక్షించారు. తద్వారా భారీ స్థాయి పరిశ్రమగా మారుతుందని, మరింత ఎక్కువ మందికి జీవనోపాధులు లభిస్తుందని ఆయన అన్నారు. గిరిజన కుటుంబాలు ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలని అందుకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గిరి వెలుగు ఏపిడి వై. సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆతవ రోడ్డు నిర్మాణంలో జాప్యమేల?

మండల మాలమహానాడు అధ్యక్షులు దేబార్కి



విశాలాంధ్ర-వేపాడ: ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికి ఆతవ రోడ్డు నిర్మాణంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని మండల మాలమహానాడు అధ్యక్షులు దేబార్కి కిరణ్ ఆవేదన వ్యక్తం చేసారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వేసిన ఆతవ తారు రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో అనతి కాలంలోనే సిద్ధిలావస్థకు చేరుకుందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా నిధులు మంజూరులో జాప్యం వల్ల చాలకాలం ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారన్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కృషి మేరకు నిధులు మంజూరు కాగా ఇటీవల సంబంధిత కాంట్రాక్టర్ వెట్ మిక్స్ తో రెండు పొరల రోడ్డు నిర్మాణం పూర్తి చేసారు. కానీ వెంటనే తారు రోడ్డు నిర్మాణం జరగక పోవడంతో మెటల్ రాళ్లు బాగా తెలిపోయి మరలా రోడ్డు పూర్తిగా పాడయ్యే ప్రమాదం ఉందన్నారు. అలాగే పైప్ కల్వర్టుల నిర్మాణం కూడా చేపట్టక పోవడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేసారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తారు రోడ్డు నిర్మాణంతో పాటు పైప్ కల్వర్టుల నిర్మాణం కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల మాలమహానాడు అధ్యక్షులు దేబార్కి కిరణ్ కోరారు.

అన్నదానం గొప్ప పుణ్య కార్యక్రమం

జనసేన నేత గురాన అయ్యలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: అన్ని దానాల కంటే అన్నదానం గొప్ప కార్యక్రమమని జనసేన నేత గురాన అయ్యలు అన్నారు .ఆదివారం బీసీ కాలనీలో దేవీ నవరాత్రి ఉత్సవాలులో భాగంగా అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న గురాన అయ్యలు మాట్లాడుతూ నవరాత్రోత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనియమన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకొని సమజానికి ఉపయోగపడే మంచి పనులు చేయాలని సూచించారు. సనాతన ధర్మాన్ని, మానవత విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. యువకులు మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీకాలనీ దేవీ నవరాత్రుల కమిటీ సభ్యులు , పట్టణ జన సైనికులు ఎల్ .రవితేజ, అడబాల వేంకటేష్ నాయుడు, వజ్రపు నవీన్ కుమార్ , ఎమ్.పవన్ కుమార్ , పృథ్వీ భార్గవ్, కె.సాయి తదితరులు పాల్గొన్నారు.

17వ డివిజన్‌లో జగనన్న సురక్ష



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్ అన్నారు. శనివారం 17వ డివిజన్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కమీషనర్ ఆర్ శ్రీ రాముల నాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు తో కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిలువ ఉన్న మందుల వివరాలను పరిశీలించారు. దాదాపు 170 రకాల మందులు అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నేత్ర పరీక్షలు చేసుకున్న వారికి కళ్లద్దాలను ఉచితంగా అందజేసారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటివరకు 12 ప్రాంతాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలు పూర్తయ్యాయని, తమ డివిజనల్ ప్రాంతంలో 13వ శిబిరాన్ని శనివారం ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇంతవరకు జరి గిన కార్యక్రమం ద్వారా దాదాపు 8,500 మంది వైద్య సేవలు పొందారన్నారు. 120 వరకు శాస్త్ర చికిత్సలకు ఆరోగ్యశ్రీ కింద రిఫెరల్ చేయడం జరిగిందన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న ఉద్దేశంతో అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి శాస్త్ర చికిత్సలు కూడా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-శృంగవరపుకోట : శృంగవరపుకోట శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ దామోదర శ్రీధర్ ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఇంగ్లీష్ లెక్చలర్ పి.జి.ఆర్.మోహన్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు వేయడం వలన కలుగు ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులచే క్యారం బోర్డ్, చదరంగం తదితర ఆటలను ఆడించామని లైబ్రేరియన్ శ్రీధర్ వివరించారు.

చీపురుపల్లి పట్టణంలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి పట్టణంలో గ్రామ సచివాలయం 2 పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ తనయులు జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొత్స సందీప్ విజయనగరం జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఉపాధ్యాక్షులు వంశీకృష్ణ చీపురుపల్లి పట్టణంలో గ్రామ సచివాలయ 4పరిదిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. విజయనగరం విజయనగరం జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ ఉపాధ్యాక్షులు వంశీకృష్ణ ఎంపీపీ ఇప్పిలి వెంకట నర్సమ్మ, చీపురుపల్లి మండల పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనువాస నాయుడు, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

బీవైవీ ప్రీమియర్ లీగ్ గోడపత్రికల ఆవిష్కరణ



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : వచ్చే నెల 14న జరగనున్న బిజినెస్ యూత్ ఆఫ్ విజయనగరం(బీవైవీ) ప్రీమియర్ లీగ్ సీజన్ - 2కు సంబంధించిన గోడ పత్రికలను ఏపీ శాసనసభ ఉపసభాపతి, స్థానిక శాసనసభ్యులు కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ఆవిష్కరించారు. రామనారాయణం రోడ్డులోని గ్రోవ్ స్పోర్ట్స్ పార్క్ వేదికగా ఆ రోజున జరిగే ఈ క్రికెట్ పోటీల ద్వారా వచ్చిన మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి వెచ్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్, వైకాపా యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సంగంరెడ్డి బంగారు నాయుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, బీవైవీ ప్రీమియర్ లీగ్ సమర్పకులు జి.ఈశ్వర్ కౌశిక్, కార్పొరేటర్లు అల్లు చాణక్య, బందారు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధమశ్రేణి ప్రదర్శన క్షేత్రాలను సందర్శించిన కెవికె శాస్త్రవేత్తలు

విశాలాంధ్ర-కురుపాం: కృషీవిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ తేజేశ్వరరావు ,డాక్టర్ శ్రీనివాస్ జియ్యమ్మవలస మండలం లోని ప్రధమశ్రేణి ప్రదర్శన క్షేత్రాలను కొత్త వంగడం ఎంటియు 1224 క్షేత్రాన్ని పెదమేరంగి, గిజబ , చింతలబెలగాంలో పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈరకం వంగడం తెగుళ్లు తట్టుకునే శక్తి కలిగి ,అన్నం వండుకుని తినేందుకు బాగుంటుందని తెలిపారు. అలాగే చిరుసంచుల ప్రదర్శన పరిశీలించారు. ఈసందర్శనలో డాక్టర్ స్రవంతి ,డాక్టర్ అనంత విహారి ,డాక్టర్ అమృత వీణా ,రైతులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో హైజానిక్ కిట్స్, దుస్తులు పంపిణీ



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా, బొబ్బిలి మండలం కోమటిపల్లి గ్రామంలో కదలలేని పరిస్థితి లో నిరుపేదలై మంచానికి పరిమితం అయిన వృద్దులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు హైజానిక్ కిట్స్ స్టీల్ గిన్నెలు, వృద్ధు లకు పండ్లు, బన్స్, పంచలు, టవల్స్, కొంత ఆర్థిక సహాయము అందజేశారు. పార్వతీపురం, మెయిన్ రోడ్ లో గల గాయత్రి రెడీ మేడ్ షాప్ వారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు బోటు అప్పల నరసయ్య, బోటు రామకృష్ణ నైటీలు, టవల్స్, స్టీల్ కంచాలు, గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో బొంతల కోటి సాంబ మూర్తి కళామందిర్ నిర్వాహకులు బొంతల కోటి శంకర్రావు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యులు కోలా సీతారాం, కొత్తకోట లక్ష్మణరావు, త్రాసుల సతీష్‌చంద్ర స్వచ్ఛంద సహాయకులు గుడివాడ చందు, ఆవాలు త్రినాథ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సేవలు భేష్

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్థానిక సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందించిన సేవలను ప్రజలు కొనియాడుతున్నారు. శిబిరానికి వచ్చిన రోగులను స్థానిక హైస్కూల్ ప్రదాన ద్వారం వద్ద రిసీవ్ చేసుకుని వారిని తమచేతులతో ఎత్తుకల్లి వైద్య తనిఖీలను చేయించారు. వలంటీర్లు, రెవెన్యూ సిబ్బంది వైద్య నిపుణుల వద్దకు వచ్చిన రోగులకు సహకరించారు.

పోలీసు త్యాగాల వల్లే సమాజంలో స్వేచ్ఛగా జీవిస్తున్నాం

శాసనసభ డిప్యూటీ స్పీకర్ శ్రీ కోలగట్ల వీరభద్రస్వామి



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంను జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోగల 'స్మృతి వనం'లో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ శ్రీ కోలగట్ల వీరభద్రస్వామి,జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు ముఖ్యఅతిధులుగా పాల్గొని, పోలీసు అమరవీరుల స్మృతి స్థూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ఈ సంవత్సరం అమరులైన 188మంది పోలీసుల వివరాలతో కూడిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆవిష్కరించగా, విధులు నిర్వహిస్తూ, తీవ్రవాదుల దాడుల్లో మృతి చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది పేర్లును అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ చదివి వినిపించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ శ్రీ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ప్రజా రక్షణలో పోలీసులు విధులను నిర్వహిస్తూ కొన్నిసార్లు వారి ప్రాణాలను సైతం కోల్పోయే పరిస్థితి వస్తున్నది. పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పని చేస్తేనే దేశంలో ప్రజలందరూ సుఖంగా ఉంటారు. పోలీసులు రాత్రి అనక, పగలనకా, కాలాతీతంగా, వాతావరణంతో పని లేకుండానే విధులు నిర్వహించడం వలనే నేడు మనందరం ఎంతో సురక్షితంగా జీవించగలుగుతున్నామన్నారు. విధి నిర్వహణలో వేరే ఎటువంటి ఆలోచనలు లేకుండా, పరిస్థితులకు అనుగుణంగా, అన్నింటిని అతి సూక్ష్మంగా పరిశీలిస్తూ, గంటల తరబడి నిలబడి, అంకితభావంతో విధులను నిర్వహిస్తున్నారన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎంతో ధైర్య, సాహసాలతో మావోయిస్టుల చర్యలను ఎదుర్కొంటూ విధులు నిర్వహించి అమరులైన పోలీసు కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపి, వారికి అండగా ఉంటామని అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ - విధి నిర్వహణలో పోలీసులు చూపిస్తున్న అంకిత భావం, సేవా దృక్పదం, త్యాగాల వలనే మనమంతా ప్రశాంత వాతావరణంలో ఉంటున్నామన్నారు. విధి నిర్వహణలో పోలీసులు రాగద్వేషాలకు అతీతంగా, ఎంతో క్రమ శిక్షణతో, నిబద్ధతతో, సంయమనం పాటిస్తూ, విధులు నిర్వహిస్తు న్నారన్నారు. ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో 188మంది పోలీసులు తమ ప్రాణాలను కోల్పోయారని, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నారన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులు మనందరిలో చిరంజీవులుగా నిలిచిపోతారని అన్నారు.జిల్లా కలెక్టరు ఎస్. నాగలక్ష్మి, ఐఎఎస్ గారు మాట్లాడుతూ - శాంతి భద్రతల కాపాడుటలో భాగంగా పోలీసులు తమ రోజువారి విధులను నిర్వహిస్తూ, విధులను నిర్వహించే క్రమంలో ప్రాణాలను కూడా కోల్పోతున్నారన్నారు. జిల్లా పోలీసుశాఖలో పని చేస్తూ, మావోయిస్టు దాడుల్లో ఐదుగురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారని, వారిని స్మరించుకుంటూ, వారి కుటుంబాలకు అండగా ఉంటామని అన్నారు. అనంతరం, అమరులైన పోలీసులను స్మరించుకొంటూ, అమర వీరుల స్మృతి స్థూపం వద్ద పుష్ప గుచ్చాలతో నివాళులు అర్పించారు. రిజర్వు ఇన్స్పెక్టరు ఎన్. గోపాల నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పరేడ్ నిర్వహించగా, అమర వీరులకు తుపాకుల విన్యాసంతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి వెలమల శ్రీనివాసరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరిస్తూ, కొద్దిసేపు మౌనం పాటించారు.పోలీసు అమరవీరుల కుటుంబాలతో ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్పీ మరియు ఇతరఅధికారులు మమేకమై, వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని, వారికి పండ్లు, నగదును అందజేసి, వారికి అన్నివిధాలుగా అండగా ఉంటామన్న భరోసాను కల్పించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుండి దిశ పోలీసు స్టేషను వరకు జిల్లా ఎస్పీ ఎం. దీపిక ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు అమరవీరుల సేవలను కీర్తిస్తూ, ర్యాలీ, మానవ హారం నిర్వహించి, నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, సెబ్ అదనపు ఎస్పీ ఎస్.వెంకటరావు, ఎఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం. సోల్మన్, విజయనగరం డిఎస్పీ ఆర్.గోవిందరావు, ట్రాఫిక్ డిఎస్పీ డి.విశ్వనాథ్,అసిస్టెంట్ సెంట్రల్ ఇంటిలిజెన్సు అధికారి లలిత్ మోహన్ పండా, డా. మురళీ మోహన్, సిఐలు కే.కే.వి. విజయనాథ్, ఈ. నర్సింహమూర్తి, జె.మురళి, బి. వెంకటరావు, ఎస్.హెచ్. విజయ ఆనంద్, టి.వి. తిరుపతిరావు, బి. నాగేశ్వరరావు, ఎం.బుచ్చిరాజు, ఆర్ ఎస్. గోపాల నాయుడు, డిపిఒ పర్యవేక్షకులు ప్రభాకరరావు, కామేశ్వరరావు, పోలీసు అసోసియేషను రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పోలీసు అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.

వేడుకగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-వంగర: వంగర మండలంలో కొప్పర జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990 నుండి 1995 వరకు(6 నుంచి 10 తరగతి వరకు) చదివిన విద్యార్థులంతా 28 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు. శనివారం ఒక ఫంక్షన్ హాల్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ హెచ్ఎంలు జి. సత్యనారాయణ నాయుడు, మాచర్ల హరి నారాయణ, అప్పటి ఉపాధ్యాయులు మద్రాపు అప్పలస్వామి, గుంటముక్కల శ్రీరామమూర్తి, సత్తారు ఆనందరావు కె. విజయలక్ష్మి, రౌతు కృష్ణం నాయుడు, మార్కండేయులు లను పూర్వ విద్యార్థులంతా ఘనంగా సన్మానం చేశారు. మంచి సమాజాన్ని నిర్మించడంలో, ప్రతి ఒక్కరిని మంచి పౌరులుగా తీర్చిదిద్దేది గురువులే నని పలువురు విద్యార్థులు గురువుల సేవలను కొనియాడారు. అంతకుముందు 28 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలిసిన పూర్వ విద్యార్థులంతా సంతోషంగా, ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఒకరిని ఒకరు చూసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. స్నేహ భావాలను పెంపొందించుకుంటూ మానవ సంబంధాలు మరింత మెరుగుపరిచేందుకు సమిష్టిగా కృషి చేద్దామని వెల్లడించారు. విద్యాభివృద్ధికి మనమంతా ప్రోత్సాహం చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం....

నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని భావించాను. విద్యార్థి దశ నుంచే గురువుల వద్ద క్రమశిక్షణతో విద్యను నేర్చుకున్నాను. బీఎస్సీ బీఈడీ పూర్తి చేసి ప్రస్తుతం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. పట్నాయకుని శ్రీకర్, ఏపీటీఎఫ్ జనరల్ సెక్రటరీ, పూర్వ విద్యార్థి, జడ్పీ ఉన్నత పాఠశాల, కొప్పర, వంగర మండలం. 28 ఏళ్లు తరువాత కలవడం ఆనందంగా ఉంది. బాల్య దశలో ఒకే పాఠశాలలో చదువుకొని 28 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలవడం ఆనందంగా ఉంది.28 ఏళ్లు తరువాత కలవడం ఆనందంగా ఉంది.. బాల్య దశలో ఒకే పాఠశాలలో చదువుకొని 28 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలవడం ఆనందంగా ఉంది. మాది రైతు కుటుంబం. చిన్నతనం నుంచే వ్యవసాయ పనుల్లో నాన్నకు చేదోడు వాదోడుగా ఉంటూ ఉన్నత విద్యను అభ్యసించాను. వ్యవసాయ రంగంతో పాటు విద్య రంగంపై పట్టు సాధించాను. వంగర మండల కేంద్రంలో ప్రైవేట్ హైస్కూల్ ను స్థాపించి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాను. జాతీయ భాష హిందీ పై విద్యార్థులకు ఆసక్తి పెరిగేలా బోధన చేపడుతున్నాను. శీలంకి చక్రపాణి, హిందీ ఉపాధ్యాయుడు, పూర్వ విద్యార్థి, జడ్పీ ఉన్నత పాఠశాల, కొప్పర, వంగర మండలం.

హైదరాబాదులో సెటిల్ అయ్యా.....

విద్యార్థి దశ నుంచి కష్టపడి క్రమశిక్షణతో చదివాను. ఉపాధ్యాయుల సూచనలు పాటించాను. హైదరాబాదులో కస్టమ్ ఫర్నిష్ కంపెనీలో డిప్యూటీ జనరల్ మేనేజర్ గా పని చేస్తున్నాను పూర్వ విద్యార్థులమంతా ఒకే వేదికపై కలవడం ఆనందంగా ఉంది. సన్నిధి ఆనందరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్, పూర్వ విద్యార్థి, జడ్పీ ఉన్నత పాఠశాల, కొప్పర, వంగర మండలం.

రూ.20ల ప్రత్యేక వెల్ఫేర్ స్టాంపుని తక్షణమే రద్దు చేయాలి

- రాష్ట్ర బార్ కౌన్సిల్ సమావేశంలో విజయనగరం, ఎస్.కోట న్యాయవాదులు డిమాండ్
- రూ.20ల స్టాంపు అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బార్ అసోసియేషన్లు నిరసన



విశాలాంధ్ర-శృంగవరపుకోట : కోర్టుల్లో కొత్తగా అన్ని రకాల సివిల్, క్రిమినల్ పిటిషన్లకు రూ.20ల ప్రత్యేక వెల్ఫేర్ స్టాంపు అంటించాలన్న రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉత్తర్వులను విజయనగరం, ఎస్.కోట న్యాయవాదులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని బార్ అసోసియేషన్లు తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ప్రాంగణంలో రాష్ట్ర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా రామారావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో విజయనగరం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చొక్కాపు దామోదర్, ఎస్.కోట న్యాయవాదుల సంఘ కార్యదర్శి డబ్ల్యు.ఎన్. శర్మ తదితరులు రూ.20ల ప్రత్యేక వెల్ఫేర్ స్టాంపును రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర అధ్యక్షుడు గంటా రామారావుకి తీర్మాన కాపీలను అందజేశారు. చొక్కాపు దామోదర్ మాట్లాడుతూ రూ.20ల ప్రత్యేక వెల్ఫేర్ స్టాంపు రద్దు, ప్రస్తుతం అంటిస్తున్న రూ.100 వెల్ఫేర్ స్టాంపు ధర రూ.200, రూ.250 చేసి న్యాయవాదుల వెల్ఫేర్ ఫండును పెంచుకోవాలని సూచించారు. ఇక క్రమంతప్పకుండా రాష్ట్ర అసోసియేషన్ ఖర్చు చేస్తున్న వివరాలు జిల్లాలోని అన్ని బార్ అసోసియేషన్లకు తెలియజేస్తే ఎటువంటి అనుమానాలు తలెత్తవని సూచించారు. కాగా ఈ అత్యవసర సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బార్ అసోసియేషన్లు రూ.20 ప్రత్యేక వెల్ఫేర్ రద్దు చేయాలని, న్యాయవాదుల మరణాంతరం ఇచ్చే వెల్ఫేర్ ఫండ్ రూ.4లక్షల నుండి రూ.10లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్.కోట న్యాయవాదులు బి.త్రిమూర్తులు, వారాది ఈశ్వరరావు, రావాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యకర సమాజం

- ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విశాలాంధ్ర, శృంగవరపుకోట :జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యకర సమాజం వర్ధిల్లుతుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఎస్.కోట మండలం, ఎస్.కోట-4 గ్రామ సచివాలయం పరిధిలో శనివారం ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైస్ ఎం.పి.పి ఇందుకూరి సుధారాజు దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యకర సమాజ స్థాపనే లక్ష్యంగా మన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇంటింటికీ వాలంటీర్లు, ఏ.ఎన్.ఎం.ల ఆరోగ్య సర్వేతో పాటు గ్రామ సచివాలయ పరిధిలోని సిడిఎన్సిడి సర్వే జాబితా వివరాలు ఆధారంగా రోగులను గుర్తించి ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకుండా మెరుగైన వైద్యం అందించడమే కార్యక్రమ ఉద్దేశమని అన్నారు. ఆరోగ్యశ్రీ క్రింద అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలు పొందుటకు అందుబాటులో గల ఆసుపత్రుల గురించిన సమాచారం శిబిరానికి వచ్చే రోగులకు తెలియజేయడం గొప్ప విషయం అన్నారు. శిబిరానికి వచ్చే వారికి అవసరమైన వైద్య చికిత్సలతో పాటు మందులు అందిస్తున్నారని సూచించారు. అనారోగ్యంతో అధిక డబ్బులు ఖర్చుపెట్టి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామాల్లో నిర్వహిస్తుందని అన్నారు. వైద్యశిబిరంలో సేవలు పొందుచున్న ప్రజలతో ఎమ్మెల్సీ మమేకం అయ్యారు. శిబిరం వద్ద అందుతున్న వైద్య సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందిస్తుండడంతో వైద్య పరీక్షలు కోసం శిబిరానికి వచ్చామని, వైద్య శిబిరంలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని పలువురు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్యకర గ్రామాలే లక్ష్యంగా చేసుకుని జగనన్న సురక్ష వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య శిబిరంలో జెషధాలు అందుబాటులో ఉన్నాయని, అవసరం మేరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని ఆయన చెప్పారు. నేత్ర వైద్య పరీక్షలు సైతం శిబిరాల వద్దే చేయడం జరుగుతోందని అన్నారు. ఇది ఒక మంచి కార్యక్రమమని, ప్రజల వద్దకే వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం సంకల్పించడం గొప్ప విషయమని అన్నారు. జీవన శైలిలో మార్పులు కారణంగా ఇటువంటి అసంక్రమిత వ్యాధులైన షుగర్, బీపీ వంటి వ్యాధ్యి చెందుతున్నాయని, వాటి పట్ల ఈ శిబిరములో అవగాహన కల్పించడం జరుగుతోందని వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార శాలను తనిఖీ చేసి శిబిరానికి వచ్చే అందరికీ ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, రక్తహీనతతో బాధపడుతున్న వారికి అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆరోగ్య కిట్లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి, ఎం.పి.టి.సిలు మజ్జి దేవి, బొడ్డేటి ఆదిలక్ష్మి, నాయకులు గంగరాజు, వాకాడ రమణ, వెంకటరమణ, ఎం.పి.డి.ఓ శేషుబాబు, పంచాయితీ విస్తరణాధికారి లక్ష్మి, వైద్యాధికారులు, పలువురు పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ, రెవిన్యూ శాఖ జిఎడిఎస్ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు. 22

సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే అప్పలనరసయ్య

విశాలాంధ్ర-దత్తిరాజేరు : మండలంలో గల పెదమానాపురం గ్రామంలో శనివారం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ ను గజపతినగరం శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఎటువంటి లంచాలకు తావు లేకుండా మన రాష్ట్రంలో అద్భుతమైన పాలన అందిస్తున్నారు. ఇంతకుముందు ఏ ప్రభుత్వము ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి కుల మతాలు, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ప్రజల వద్దకే పాలన అందిస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో మరలా జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. అనంతరం చేపలవలస గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి గడప గడప కు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని తక్షణమే పరిష్కారం చేసి ఈ నియోజకవర్గంలో ఏ సమస్య లున్నా నా దృష్టికి తీసుకువస్తే పరిష్కారం అయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, జడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు, బీసీ సెల్ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు,మండల పార్టీ అధ్యక్షులు రాపాక కృష్ణార్జున, ఏఎంసి వైస్ చైర్మన్, పిఏసిఎస్ అధ్యక్షులు, జిల్లా టెలికామ్ డైరెక్టర్ చిరంజీవి , సర్పంచులు, ఎంపీటీసీలు, తహసిల్దార్ రమేష్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జామి అగ్రహారం భూముల రీసర్వేకు రెండు బృందాలు ఏర్పాటు

తహశీల్దార్ హేమంత్‌కుమార్ వెల్లడి

విశాలాంధ్ర-జామి: ఏళ్ల తరబడి పట్టాలకు నోచుకోని జామి అగ్రహారం భూములకు త్వరలోనే పరిష్కారం చూపెందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తహశీల్దార్ జి.హేమంత్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జామి- అగ్రహారం భూముల కోసం ఇచ్చిన నోటిఫికేషన్ అనంతరం ఇప్పటి వరకు 1416 ధరఖాస్తులు అందాయన్నారు. వీటిలో రైతులు చేసుకున్న వివిధ రకాల ధరఖాస్తులు ఉన్నాయన్నారు. గతంలో ఇనాందారుల నుంచి తాము కొనుగోలు చేసిన దాఖ్యమెంట్లును అందజేసారన్నారు. కొందరు తమ తాతల నుంచి సాగు చేస్తున్నామని ఇప్పుడు మూడు తరాల అనంతరం వారసులు సాగులో ఉన్నామని తెలిపారన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న ప్రతీ రైతుకు న్యాయం చేస్తామని, ఇందులో ఆందోళన చెందవద్దని సూచించారు. మొత్తం 2700 ఎకరాలకు సంభందించి రీసర్వే చేయాలని నిర్ణయించామన్నారు. అందుకు ఒక విఆర్ఒ, ఇద్దరు సర్వేయర్‌లతో కలిసి రెండు బృందాలను ఏర్పాటు చేసామన్నారు. వీరు ఈనెల 26నుంచి రీసర్వే ప్రారంభిస్తారని, నెలరోజుల్లోనే పూర్తి అవుతుందన్నారు. అలాగే ఫారం-5 ఎ పూర్తి చేస్తామన్నారు. 250 ఎకరాలకు సంభందించి కోర్టుల వివాదాలు నడుస్తున్నాయన్నారు. ఇనాం దారులు ఇప్పటికైనా తమ అభ్యంతరాలను తగిన ఆధారాలతో తమను సంప్రదించవచ్చన్నారు. అన్ని సమస్యలను పరిష్కారం అయిన అనంతరం వచ్చే సంక్రాంతికి రైతులకు పట్టాలను మంజూరు చేయాలని భావిస్తున్నామన్నారు. రైతుల కళ్లల్లో ఆనందమే తమ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంనకు అనూహ్య స్పందన

సుమారు 450 రోగులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-మెరకముడిదాం: మెరకముడిదాం మండలం సాతాం వలస సచివాలయంలో శనివారం నాడు జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంనకు రోగులు, ప్రజలు నుండి అనూహ్య స్పందన లభించింది. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం అయిన ఆరోగ్య సురక్ష శిబిరానికి ఒకేసారి అధిక సంఖ్యలో రోగులు హాజరు అయ్యారు. శిబిరంలో సుమారు 450 మంది రోగులకు వైద్యాధికారులు అజిత్ బాబు, పూజా, ఫిజీషన్ మధుసూదన రావు, గైనిక్ ఆలాత వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు.అనంతరం రోగులకు అవసరం అయిన మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి హాజరు అయిన రోగులకు స్థానిక సర్పంచ్ అధికార ప్రతినిధి రాము శివ ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. శిబిరానికి ముఖ్య అతిధులుగా హాజరు అయిన మండల వైసీపీ నాయకులు కె వెంకటరావు, టి వేణుగోపాల రావు, ఎస్ వెంకటరమణ రాజు మాట్లాడుతూ పేదలు, రోగులు కోసం ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందించాలన్న సదుద్దేశ్యం తో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇటువంటి బృహత్తర మైన కార్యక్రమం ఏ రాష్ట్రం లో కూడా అమలు చేయటం లేదని అన్నారు. ప్రజలు ఆరోగ్య సురక్ష కార్యక్రమం ను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదలు కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిత్యం పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పి పుష్పవతమ్మ, ఎంపి డి ఓ ఎం రత్నం,తహసీల్దార్ పి విజయ్ భాస్కర్, ఎం ఇ ఓ 1 చంద్రశేఖర్, ఎంఇఓ 2 ఎం ప్రసాద్ రావు, డిప్యూటీ తహసీల్దార్ గిరిధర్, వైద్య, సచివాలయం, అంగన్వాడీ లు సిబ్బంది, సర్పంచ్ లు,ఎంపిటిసి లు, తదితరులు పాల్గొన్నారు.

200 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ బోజంకి దృశ్యం

విశాలాంధ్ర-వేపాడ: వేపాడ మండలంలోని చినగుడిపాల , బోజంకివానిపాలెం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ద్వారా శిబిరాన్ని ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాల ద్వారా 200 పశువులకు ఉచితంగా వ్యాధినిరోధక టీకాలు వేశారు. ఈ శిబిరాలను చిన్న గుడిపాల గ్రామ సర్పంచ్ బోజంకి రాముునాయుడు ప్రారంభించారు . ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పశువైద్య సిబ్బంది సూచనలు సలహాలు పాటించి రైతులంతా వారి పశు సంపదను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. లంపి స్కిన్ వ్యాధి సోకిన పశువులకు పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే శిబిరాలు ముందుగా రైతు భరోసా కేంద్రం సిబ్బందికి తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక గోపాలమిత్ర బోజంకి సింహాద్రప్పడు బానాది, కుమ్మపల్లి ఏ హెచ్ ఏ లు సతీష్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు

అమరావతి ఎగ్జిబిషన్ ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విజయనగరం లోని స్థానిక బాలాజీ జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అమరావతి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ని రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ వెంపడపు విజయలక్ష్మి, ఇతర కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంపడపు విజయలక్ష్మి మాట్లాడుతూ పండగ సందర్భంగా ఇలాంటి మంచి వినూత్నమైన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం ఈ భవనాలను ప్రజలకు అందుబాటులో ఉంచారని తెలిపారు. ప్రజలు ఉత్సాహంగా గడిపేందుకు ఎంతోగానో ఉపయోగపడుతుంది అని తెలిపారు. నిర్వాహకులకి మంచి లాభాలు తెచ్చిపెట్టాలి అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ అధినేత శ్రీనివాస్ రెడ్డి, గోల్డ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు

ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర విజయనగరం టౌన్ : రాష్ట్రోపాధ్యాయ సంఘం, (ఎస్టియూ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట శనివారం ఆక్రందన దీక్షల పేరుతో శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు వై అప్పారావు ప్రధాన కార్యదర్శి డి. శ్యామ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా యస్.టి.యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె జోగారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు వివిధ బిల్లులకు సంబంధించి పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని,లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు వై అప్పారావు గారు మాట్లాడుతూ ఉద్యోగులకు తమ అవసరాల కోసం దాచుకున్న పి.ఎఫ్. ఖాతా నుంచి కూడా అవసరానికి డబ్బులు విడుదల చేయడం లేదని, ఇది చాలా దారుణమని ఇకనైనా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు జీతాలు చెల్లించడమే భాగ్యంగా భావిస్తుందని, మిగతా బిల్స్ అన్ని కూడా పెండింగ్‌లో పెడుతుందని,ఇది సరికాదని. ఉద్యోగుల సంక్షేమం కూడా ప్రభుత్వ బాధ్యతేనని. మర్చిపోకూడదని ఎద్దేవా చేశారు. లిరిక్స్ అనంతరం డిఆర్ఓ శ్రీమతి యస్.డి.అనిత గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఎస్టీయూ చేపట్టిన ఆక్రందన దీక్షకు మద్దతుగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె ఏ వి ఆర్ కె ఈశ్వరరావు గారు మద్దతు తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులు: సిహెచ్ సూరిబాబు, వి గోవిందరావు,రాష్ట్ర కౌన్సిలర్, రవి, రమణ,రాంబాబు,రామచంద్ర, రమణ, శంకరరావు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అనుమతి లేని భవనాలపై చర్యలు చేపట్టండి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో భవన నిర్మాణాలకు మున్సిపల్ అనుమతి లేని భవనాలపై చర్యలు తీసుకో వాలని మున్సిపల్ కమిషనర్ యస్. శ్రీనివాసరావు టౌన్ ప్లానింగ్ అధికారి వరప్రసాదరావును ఆదేశించారు . శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పట్టణంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఇన్చార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్, పర్యావరణ ఇంజనీర్ మరియు పారిశుధ్య కార్యదర్శులతో గొల్లపల్లి దాడి తల్లి కాలనీలో పర్యటించారు.ఇంటింటి చెత్త సేకరణ పరిశీలించి ప్రతిరోజు పారిశుధ్య కార్మికులు వచ్చి చెత్త సేకరిస్తుంది, లేనిదీ వీధిదీపములు వెలుగుతున్నది, లేనిదీ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశలో ఉన్న భవనాన్ని పరిశీలించి ప్లాన్ లేకుండా నిర్మిస్తున్నారని తెలుసుకొని వారికి నోటీసులు జారీ చేసి కేసు ఫైల్ చేయాల్సిందిగా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కి ఆదేశించారు. దాడి తల్లి కాలనీ ప్రజలు తాగునీటి పైపులైన్ వేయాల్సిందిగా కోరగా సువర్ణముఖి నది ఆధారంగా త్రాగునీటి పైప్ లైన్ ప్రాజెక్టు పనులు జరుగుతున్నందున పనులు పూర్తయిన వెంటనే త్రాగునీటి సరఫరా పైప్ లైన్లు మరియు డిస్ట్రిబ్యూషన్ లైన్లు వేయిస్తామని తెలియజేశారు.

చెట్లను కాపాడుతూ పర్యావరణ పరిరక్షణకు అన్ని శాఖలతో చర్యలు

న్యాయమూర్తి వాణికి విన్నవించిన తహశీల్దార్ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: చెట్లను నరకేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు.? - పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని గత నెల 23న ప్రి లిటిగేషన్ కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి కుమారి సబ్బవరపు వాణి హితవు పలికిన విషయము విదితమే. శనివారం వాయిదాకు హాజరయిన శృంగవరపుకోట తహశీల్దార్ డి.శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులతో గెలకారీ నెల 30న తేదిన సమావేశం ఏర్పాటు చేసి చెట్ల నరికివేత నివారణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించామన్నారు. ఇకపై పూర్తి స్థాయి అనుమతులు లేకుండా చెట్లను తొలగించకూడదని అందరికీ సూచించామన్నారు. పర్యావరణ పరిరక్షకు అన్ని శాఖలవారు తగు చర్యలు తీసుకోవాలని చెప్పామన్నారు. పర్యావరణ ప్రేమికుడు, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ విశాఖ-అరకు రోడ్డు పక్కన రోడ్లు భవనాలు శాఖ పరిధిలో ఉన్న భారీ టేకు చెట్టు నరికివేతను ప్రీ లిటిగేషన్ కేసు ద్వారా తప్పుబట్టినందుకు, బదులుగా పది మొక్కలను అక్టోబరు 13వ తేదీన నాటినట్లు తహశీల్దార్ ఫోటోలను కోర్టు వారికి సమర్పించారు. విద్యుత్ తీగలకు అడ్డు వచ్చిన కొమ్మలను తప్పా చెట్లను తొలగించవద్దని విద్యుత్ శాఖ సహాయక ఇంజనీరుకి ప్రత్యేకంగా ఆదేశాలను యిచ్చామన్నారు. గతంలో ఆర్ అండ్ బి సహాయక ఇంజనీరుని సెక్యూర్ డిపాజిట్ ద్వారా టేకు చెట్టు వేలం వేసి, ప్రభుత్వానికి ఆ సొమ్మును చెల్లించి, రసీదు ప్రతిని కోర్టువారికి అందజేయాలని సూచించారు. అయితే యింకా వేలం ప్రక్రియ పూర్తి కాలేదని, త్వరలో రసీదుని కోర్టువారికి సమర్పిస్తామని సంబంధిత అధికారులు విన్నవించారు. స్పందించిన కేసును చేసుకున్న చెట్టును అటవీశాఖ ద్వారా ధర నిర్ధారణ చేసి వేలం ప్రక్రియ త్వరగా నిర్వహించి వివరాలు అందజేయాలని ఆదేశిస్తూ న్యాయమూర్తి ఎస్.వాణి ఈ కేసును వచ్చే నెల 4వ తేదీకి వాయిదా వేశారు. ప్రత్యేక లోక్ అదాలత్ లో రెవెన్యూ శాఖకు సంబంధించిన కేసులను పరిష్కరించారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అయోడైజ్డ్ ఉప్పు రక్షణ కవచం

విశాలాంధ్ర-విజయనగరం:విజయనగరం పట్ట ణంలో శనివారం జరిగిన ల్ అయోడిన్ డెఫిషియన్సీ డిజార్డర్ డే" సందర్భంగా జండా ఊపి ర్యాలీ ని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా. ఎస్. భాస్కర రావుప్రారంభించారు. ఈ సందర్భంగా డా. ఎస్. భాస్కర్ రావు మాట్లాడుతూ అయో డాయిజ్డ్ ఉప్పు అతి గొప్ప రక్షణ కవచం, థైరాయిడ్ గ్రంథికి పనిచేయడానికి ఉప్పు ఇది దోహద పడుతుంది అన్నారు. నాన్ - అయో డాయిజడ్ ఉప్పు తీసుకోవడం వల్ల థైరాయిడ్ రుగ్మతలు వస్తాయి అని తెలియజేశారు, ఇందులో హైపర్ థైరాయిడ్ మరియు హైపో థైరాయిడ్ గుర్చి వివరించారు, శరీరం మరియు మనస్సు రెండింటిని అభివృద్ధి చేయడం లో అయో డాయిజడ్ ఉప్పు రారాజు ఈ అయో డాయిజడ్ ఉప్పు ని ఉపయోగించడం వలన గాయిటర్ వంటి వ్యాధులు రాకుండా నివారిస్తుంది, మెదడును అభివృద్ధి చేస్తుంది, జీవ క్రియను క్రమబద్దీకరిస్తుంది, అలాగే రోగ నిరోధక శక్తిని పెంచుతుంది అదేవిధంగా ప్రతి గర్భిణి అయోడిన్ ఉప్పును వాడడం వలన గర్భం లోని శిశువు ఆరోగ్యంగా ఎదుగుతుంది. అయోడిన్ ఉప్పు వాడడం వల్ల పిల్లల శరీరక మానసిక అభివృద్ధికి దోహద పడుతుంది అని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా. ఎస్. భాస్కర్ రావు గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా. ఎస్. సూర్య నారాయణ , డా. పి. రవి కుమార్, చిరపల్లి గారు డెమో, శ్రమతి వై. మనీ జిల్లా మలేరియా అధికారి, డా. వెంకటేశ్ ,ఏపీడెమాలజిస్ట్, జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి వారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

29న విజయవాడలో జరిగే ఏపీటీఎఫ్ రాష్ట్ర ధర్నాను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-సీతానగరం: ఈనెల 29న విజయవాడలో జరగబోవు ఏపీటీఎఫ్ ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ మండల నాయకులు పిలుపునిచ్చారు.శనివారం దీనికి సంబంధించి గోడపోస్టర్లు స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నందు ఆవిష్కరణ చేశారు. సీతానగరం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నందు ఏపిటిఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులతో ధర్నా పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమమునకు రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనుంజ యరావు, జిల్లా కార్యదర్శి పిఎస్ మోహనరావు, మండలశాఖ అధ్యక్షులు టి.గౌరునాయుడు, మండల ప్రధాన కార్యదర్శి పి సత్యనారాయణ, మండల కార్యవర్గ సభ్యులు ఎస్ సత్యం నాయుడు, ఎం గౌరీశ్వరరావు, సిహెచ్ శ్రీనివాసరావు, ఆర్ తిరుపతిరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. అక్టోబర్ 29న ధర్నాచౌక్,విజయవాడ నందు జరిగే ఏపీటీఎఫ్ ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనుంజయరావు తదితరులు పిలుపునిచ్చారు. డిమాండ్ల సాధనకోసం రాష్ట్రవ్యాప్తంగా అంతమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జీపియస్ ను రద్దుచేసి పాతపెన్షన్ విధానమును పునరుద్దరించాలని, ప్రతి నెల 1న ఉద్యోగులకు,ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని, 2003 డిఎస్సీ వారికి పాత పెన్షన్ విధానమును పునరుద్దరించాలని, జి.ఓ.నం.117ను రద్దుచేయాలనిడిమాండ్ చేశారు. అంతర్ జిల్లా / అంతర్ రాష్ట్ర బదిలీలు జరపాలని, దీర్ఘకాలికంగా పెండింగ్లో, సంపాదిత సెలవులు నగదు చెల్లింపులు, పిఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్స్ %డి% క్లెయిమ్స్ తక్షణమే మంజూరు చేయాలని,జిల్లా పునర్విభజన నేపథ్యంలో పంచాయితీ రాజ్ తదితర లోకల్ బాడీస్ లోని టీచర్ల కేడర్లను లోకల్ కేడర్ గా ఆర్గనైజ్ చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు పొంది ప్రభుత్వ, పంచాయితీ రాజ్ టీచర్లకు ఉమ్మడి సీనియారిటీ ఆధారంగా హెచ్ ఎం, ఎం ఈ ఓ, డీ ఎల్, డైట్ తదితర పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2018 నుండి ఉన్న డి.ఎ బకాయిలను చెల్లించాలని, సి పి ఎస్ ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న డిఎ అరియర్స్, పిఆర్సీ 90శాతం నగదును తక్షణమే మంజూరు చేయాలన్నారు. 3 సం%శ్రీ%లుగా లోకల్ బాడీస్ లో మూడువేలు పైగా పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలను తక్షణమే చేపట్టాలని, 25వేల పోస్టులతో నూతన డిఎస్సీని నిర్వ హించాలని, పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల 11వ పిఆర్సీ అరియర్స్, డి.ఎ బకాయిలను వెంటనే చెల్లించాలనిడిమాండ్ చేశారు. మున్సిపల్ సర్వీస్ రూల్స్ అమలు చేసి బదిలీలు,పదోన్నతులు కల్పించాలని, 12 వ పి ఆర్సీలో 30శాతంఫిట్ మెంట్ ను వెంటనే ప్రకటించాలని, ఎయిడెడ్, మోడల్ స్కూల్ ,కె.జి.బి.వి,గిరిజన ,గురుకులాలు, సమగ్ర శిక్ష సిబ్బంది పండిట్, పీఈటీల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏపీ ఉపాధ్యాయ వ్యవస్థలో ఎంటిస్ విధానమును రద్దుచేసి 1998,2008 డి.ఎస్సీ ఎంటిస్ వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు.సిపిఎస్ రద్దు మరియు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం చేసిన ఉద్యమాల సందర్భంగా అక్రమంగా బనాయించిన కేసులన్నింటిని ఎత్తివేయాలనిడిమాండ్ చేశారు. ఆయా ఏపి సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాల్లో ఏపీటీఎఫ్ చేసిన ప్రాతినిధ్యాలన్నింటిని పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

పోలీసు అమర వీరులకు జోహార్లు

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



విశాలాంధ్ర,పార్వతీపురం: శత్రు దేశాల నుండి దేశాన్ని కాపాడే వీర జవానులు, దేశంలో శాంతి భద్రతలను రక్షించే అమర వీరులైన పోలీసు సిబ్బందికి జోహార్లు అర్పిస్తూ వారి సేవలను పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ స్మరించుకుంటూ ఉంటారని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని ఆయన విలేఖరులతో మాట్లాడారు.సైనిక బలగాలు, పోలీస్ బలగాలు దేశానికి విస్తృతమైన సేవలు అందిస్తున్నాయన్నారు.1959 అక్టోబరు 21న హిమాలయాల్లోని ఆక్సాయిచిన్ అనే ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న 10మంది సిఆర్పిఎఫ్ జవానులను శత్రు దేశ సైనికులు హతమార్చారని,అప్పటి నుండి దేశ భద్రతకు ప్రాణత్యాగాలు చేసిన పోలీసు వీరులను స్మరించుకొనుట ప్రతి సంవత్సరం అక్టోబరు 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకొంటున్నామనితెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్న పోలీసుల సంఖ్య ప్రతిఏటా పెరుగుతూనే వుందన్నారు. అయినప్పటికీ, పోలీసులు విధినిర్వహణలో రాజీలేని పోరాటాలు జరిపి శీఘ్రవాద చర్యలను ఎదిరించడంలోను, శాంతిభద్రతల పరిరక్షణలోను కీలకమైన పాత్రను పోషిస్తూనే ఉన్నారని చెప్పారు.ఉమ్మడి విజయనగరంజిల్లా పోలీసుశాఖలో ఇప్పటి వరకు శాంతి భద్రతల పరిరక్షణలోకరు, తీవ్రవాద ప్రతీకార దాడులలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారనితెలిపారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీసులు నేడు భౌతికంగా మన మధ్య లేకున్నా, పోలీసుశాఖకు వారు చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. జిల్లాలో అమరవీరుల వివరాలు

1.ముద్దాడ గాంధీ : ముద్దాడ గాంధీ 1962 జూన్ 22న విశాఖపట్నంలో జన్మించారు. ఆంధ్రా యూనివర్సిటీలో గ్రాడ్యుయేషను పూర్తి చేసారు. పోలీసుశాఖలో రిజర్వు సబ్ ఇన్ స్పెక్టరుగా 1985లో ఉద్యోగంలో చేరారు. అనంతరం, ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం అనతికాలంలోనే 1991లో సివిల్ విభాగానికి కన్వర్షన్ జరిపి చేసింది. మనోరంజనను వివాహం చేసుకున్న ముద్దాడ గాంధీకి కుమార్తె పూజా, కుమారుడు అభిలేష్ అనే ఇద్దరు పిల్లలు కలరు. గాంధీ విజయనగరం జిల్లా కొమరాడ పోలీసు స్టేషనులో సబ్ ఇన్ స్పెక్టరుగా బాధ్యతలు నిర్వహించే సమయంలో కొమరాడ మండలం కొప్పంగి అటవీ ప్రాంతంలోపెద్ద ఎత్తున మావోయిస్టుల సమావేశం జరుగుతున్నట్లు కీలక సమాచారాన్ని సేకరించి, ఉన్నతాధికారులకు అందించారు. వీరు అందించిన సమాచారంతో 1998ఆగస్టు 8న కూంబింగు ఆపరేషన్ చేపట్టిన పోలీసులు మావోయిస్ట్ పార్టీకి చెందిన అగ్ర నాయకులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా, మావోయిస్టులు పోలీసు బృందాలపై కాల్పులు జరిపారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో మావోయిస్ట్ పార్టీ 9మంది అగ్ర నాయకులను కోల్పోయింది. ఈసంఘటన తరువాత మావోయిస్టులు ప్రతీకారం తీర్చుకొనేందుకు ముద్దాడ గాంధీను లక్ష్యంగా ఎంచుకొన్నారు. తరువాత కొద్ది కాలానికి గాంధీ సాలూరు సర్కిల్ ఇన్ స్పెక్టరుగా బాధ్యతలు చేపట్టారు. తే. 2001 సెప్టెంబరు 21న సాలూరు న్యాయ స్థానంలో ఒక కేసుకు సంబంధించి సాక్ష్యం చెప్పేందుకు వెళ్ళిన గాంధీపై, ఆయన అంగరక్షకుడు కానిస్టేబులు సిహెచ్. చిరంజీవిపైన అతి కిరాతకంగా కాల్పులు జరిపారు. మావోయిస్టుల దొంగదెబ్బతో ఇన్ స్పెక్టరు ముద్దాడ గాంధీ, ఆయన అంగరక్షకుడు చిట్టిపంతుల చిరంజీవి సాలూరు న్యాయ స్థానంలోనే ప్రాణాలు కోల్పోయారు. శాంతియుత సమాజ స్థాపన కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ముద్దాడ గాంధీ త్యాగానికి మనం ఎన్నిసార్లు శ్రద్ధాంజలి ఘటించినా తక్కువే అవుతుంది. వారి త్యాగ నిరతిని ఎన్నడూ మరువలేము. 2.షేక్ ఇస్మాయిల్, ఎఆర్ కానిస్టేబులు: విజయనగరం జిల్లా పార్వతీపురంలో కీ.శే.లు షేక్ ఇస్మాయిల్ 1947జనవరి1న జన్మించారు. 8వ తరగతి వరకు చదువుకొని, పోలీసుశాఖలో పని చేయాలనే మక్కువతో పోలీసు సెలక్షన్స్ కు హాజరై, 1966లో ఎఆర్ కానిస్టేబులుగా ఉద్యోగం పొందారు. అనంతరం, ఎం.టి. విభాగంలో సీనియర్ డ్రైవరుగా విధులు నిర్వహించారు. 2001 ఫిబ్రవరి 1న మావోయిస్టులు కురుపాం మండలం లోవలక్ష్మీపురం గ్రామ శివారుల్లో ఒక కానిస్టేబులుని గాయపర్చి, అతని వాహనాన్ని దగ్ధం చేసారు. ఈ సంఘటన జరిగిన తరువాత ఉన్నతాధికారుల ఆదేశాలతో సంఘటనా స్థలానికి పోలీసు బృందాన్ని తీసుకొని పోలీసు వాహనంలో బయలుదేరి వెళ్ళుచుండగా మావోయిస్టులు మాటు వేసి, మందుపాతర్ల పేల్చి, పోలీసు వాహనాన్ని పేల్చివేసారు. ఈ సంఘటనలో పోలీసు వాహనానికి డ్రైవరు గా ఉన్న షేక్ ఇస్మాయిల్తో పాటు 1993వ బ్యాచ్ కానిస్టేబుల్ బి. శ్రీరాములు కూడా తీవ్రంగా గాయపడి, సంఘటనా స్థలంలోనే ఇరువురు మరణించారు. శాంతియుత సమాజ స్థాపన కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన షేక్ ఇస్మాయిల్, బి. శ్రీరాముల త్యాగాలకు మనం ఎన్నిసార్లు శ్రద్ధాంజలి ఘటించినా తక్కువే అవుతుంది. వారి త్యాగ నిరతిని ఎన్నడూ మరువలేము. 3.బి.శ్రీరాములు విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం కొండదేవుపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు1967 జూలై 1న జన్మించారు. పోస్టు గ్రాడ్యుయేషన్ (ఎం.ఎ.) పూర్తి చేసిన శ్రీరాములు పోలీసుశాఖలో పని చేయాలనే ఆసక్తితో 1993లో నిర్వహించిన పోలీసు సెలక్షన్స్ కు హాజరై, సివిల్ కానిస్టేబులుగా ఎంపికయ్యారు. అనంతరం ప్రమీలను వివాహం చేసుకోగా, వీరికి ఉపేంద్ర, పృథ్వీరాజ్ అనే ఇద్దరు కుమారులు కలరు. 2001 ఫిబ్రవరి 1న మావోయిస్టులు కురుపాం మండలం లోవలక్ష్మీపురం గ్రామ శివారుల్లో ఒక కానిస్టేబులుని గాయపర్చి, అతని వాహనాన్ని దగ్ధం చేసారు. ఈసంఘటన జరిగిన తరువాత ఉన్నతాధికారుల ఆదేశాలతో సంఘటనా స్థలంకు పోలీసు బృందంతో కలసి పోలీసు వాహనంలో బయలుదేరి వెళ్ళుచుండగా మావోయిస్టులు మాటు వేసి, మందుపాతర్ల పేల్చి, పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసారు. ఈ సంఘటనలో పోలీసు బృందంలో సభ్యులుగా ఉన్న బి. శ్రీరాములుతోపాటు వాహనానికి డ్రైవరుగా ఉన్న షేక్ ఇస్మాయిల్ కూడా తీవ్రంగా గాయపడి, సంఘటనా స్థలంలోనే ఇరువురు మరణించారు. శాంతియుత సమాజ స్థాపన కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన షేక్ ఇస్మాయిల్, బి. శ్రీరాముల త్యాగాలకు మనం ఎన్నిసార్లు శ్రద్ధాంజలి ఘటించినా తక్కువే అవుతుంది. వారి త్యాగ నిరతిని ఎన్నడూ మరువలేము. 4.చిట్టిపంతుల చిరంజీవి: విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం చామలపల్లి గ్రామానికి చెందిన చిట్టిపంతుల చిరంజీవి 1961 ఫిబ్రవరి 24న జన్మించారు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న చిరంజీవి పోలీసుశాఖలో పని చేయాలనే సంకల్పంతో 1985లో నిర్వహించిన పోలీసు సెలక్షన్స్ కు హాజరై, సివిల్ కానిస్టేబులుగా ఉద్యోగం పొందారు. అనంతరం లీలావతిని వివాహం చేసుకున్న చిరంజీవికి శిరీష, ప్రత్యూష, అనూష అనే ముగ్గురు కుమార్తెలు కలరు. సాలూరు పట్టణ పోలీసు స్టేషనులో కానిస్టేబులుగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఇన్ స్పెక్టరు ముద్దాడ గాంధీ గార్కి అంగరక్షకులుగా వ్యవహరించారు. 2001సెప్టెంబరు 21న సాలూరు న్యాయ స్థానంలో ఒక కేసుకు సంబంధించి సాక్ష్యం చెప్పేందుకు వెళ్ళిన గాంధీ గారితోపాటు, ఆయన అంగరక్షకుడిగా వెళ్ళిన చిరంజీవిపైన కూడా మావోయిస్టులు అతికిరాతకంగా కాల్పులు జరిపారు. మావోయిస్టుల దొంగదెబ్బతో ఇన్ స్పెక్టరు ముద్దాడ గాంధీ గారు, ఆయనతోపాటు అంగరక్షకుడు చిట్టిపంతుల చిరంజీవి సాలూరు న్యాయ స్థానంలోనే ప్రాణాలు కోల్పోయారు. శాంతియుత సమాజ స్థాపన కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన కీ॥శే॥లు చిట్టిపంతుల చిరంజీవి, కీ॥శే॥లు ముద్దాడ గాంధీలత్యాగానికి మనం ఎన్నిసార్లు శ్రద్ధాంజలి ఘటించినా తక్కువే అవుతుంది. వారి త్యాగ నిరతిని ఎన్నడూ మరువలేము. 5. సూర్యనారాయణ, సివిల్ కానిస్టేబులు: విజయనగరం జిల్లా భోగాపురం మండలం గుడివాడ గ్రామానికి చెందిన సూర్యనారాయణ 1973 జూలై 2న జన్మించారు. గ్రాడ్యుయేషను పూర్తి చేసిన సూర్యనారాయణ పోలీసుశాఖలో ఉద్యోగం చేయాలనే సంకల్పంతో 1993లో నిర్వహించిన పోలీసు సెలక్షన్స్ కు హాజరై, సివిల్ కానిస్టేబులుగా ఎంపికయ్యారు. అనంతరం రాజును వివాహం చేసుకున్న సూర్యనారాయణకు హారిక్కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి అనే ఇద్దరు కుమారులు కలరు. స్పెషల్ పార్టీ పోలీసులతో కలసి 2003 మే 30న మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో పోలీసులు కూంబింగు నిర్వహిస్తుండగా మావోయిస్టు మాటువేసి, పెద్దబొడ్డేపల్లి గ్రామం వద్ద మందు పాతరను పేల్చిన సంఘటనలో సూర్యనారాయణ తీవ్రంగా గాయపడి 2003 మే 30న మరణించారు. శాంతియుత సమాజ స్థాపన కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన కీ॥శే॥లు సూర్యనారాయణ గారి త్యాగానికి మనం ఎన్నిసార్లు శ్రద్ధాంజలి ఘటించినా తక్కువేఅవుతుంది. వారి త్యాగ నిరతిని ఎన్నడూ మరువలేము.